'కార్మిక సంక్షేమంపై కేంద్రం నిర్లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న కీసరి నర్సిరెడ్డి

చంపాపేట: రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటిత కార్మిక సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి ఆరోపించారు. బుధవారం చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ పార్టీ నాయకుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఒకే కార్డుతో ఒకే ఓటు, ఒకే మతం నినాదంతో జమిలీ ఎన్నికలను ప్రవేశ పెట్టి దేశ ప్రజల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.రాష్ట్రంలో సాయుధ రైతాంగ పోరాటాలకు కమ్యూనిస్టులే వారసులని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అగమ్యగోచరంగా ఉందని స్థానిక సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ కార్యకర్తలు ఆందోళనకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్ యాదవ్, ఎల్లయ్య, రామస్వామి, దుర్గారావు, గణేష్, ప్రభాకర్, కోటేశ్వర రావు, గోపి, నగేష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

నాగోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని కొనసాగించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నాగోలులో నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నాగోలు శాఖ 4వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాగోలు డివిజన్ పరిధిలోని నువ్వుల బండ బస్తీ దవాఖానా సమస్యలు పరిష్కరించి తెరవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు నివాసం ఉండే కాలనీలో సరిపడా తాగునీరు అందడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను చీల్చడానికి ఏ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకుని తనకు అనుగుణంగా మార్చుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ విముక్తి పోరాటంలో బీజేపీ పాత్ర శూన్యమని.. కానీ ఆ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం దుర్మార్గమైన చర్య అన్నారు.అనంతరం సీపీఎం నాగోలు శాఖ నూతన కార్యదర్శిగా చెన్నారం మల్లేశం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, వెంకటేష్, మల్లేశం, చైతన్య, తన్నీరు చెన్నమ్మ, బండ వాణి చెన్నారం జ్యోతి, లతీఫ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: గాంధీ జయంతి సందర్భంగా బాపు బాటలో సత్య శోధన పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం నాగోలులో పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 100 రోజుల పాటు 1000 కిలో మీటర్ల మేర గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర సాగుతుందన్నారు. జోగులాంబ దేవాలయం అలంపూర్ నుంచి ఉమా మహేశ్వర దేవాలయం అచ్చంపేట వరకు పాదయాత్ర కొనసాగుతుందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఫార్మసిస్ట్, కెమిస్టులకు బీమా సౌకర్యం కల్పించాలి



ఫార్మసిస్ట్‌ను సత్కరిస్తున్న కృష్ణకుమార్

మన్సూరాబాద్: సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్‌లు, కెమిస్టులకు ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్, రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా పెండెం కృష్ణ కుమార్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సొంతంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్న మహిళా ఫార్మసిస్ట్‌లను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ఫార్మసిస్టులు సేవలు అందించారని గుర్తు చేశారు. విపత్కర పరిస్థితుల్లోనూ సేవలు అందిస్తున్న కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్‌లకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

ఉచిత పరికరాల పంపిణీకి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వనస్థలిపురం: కేంద్ర సామాజిక సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో ఏఎల్ఐఎంసీఓ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాసపురం కాలనీలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మానసిక, శారీరక స్థితిని అంచనా వేసి వారి అవసరాలకు తగిన ఉపకరణాలను సంస్థ ఆధ్వర్యంలో అందించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరంలో 120 మంది దివ్యాంగులు పాల్గొన్నట్లు శాంతినికేతన్ కార్యదర్శి సీహెచ్.రమేష్ తెలిపారు.

విలువలతో కూడిన విద్య అవసరం



సదస్సులో పాల్గొన్న రాధాకృష్ణ, విజయ్ టెక్కి

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు జీవితంలో గొప్పగా స్థిరపడాటంలే ఉన్నతమైన లక్ష్యం అవసరమని దాని కోసం మన ప్రతి అడుగు ముఖ్యమైందని నారాయణ కళాశాల డీన్ రాధాకృష్ణ, విజయ్ టెక్కి అన్నారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఏ దిశగా ప్రయాణించి, ఎలా చదివితే గమ్యాన్ని చేరుకుంటాడో తెలియక సందిగ్ధంలో సతమతమవుతూ ఉంటారన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమంబర్, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ నీరజ, ఏఓ రమేష్, స్వామి పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

వానొస్తే మునుగుడే!



అయ్యప్పకాలనీలో..



నీట మునిగిన బండ్లగూడ అయ్యప్ప కాలనీ

వర్షాకాలం మొదలైందంటే ఎల్‌బీనగర్‌వాసుల కంటిమీద కునుకు కరువవుతోంది. చిన్నపాటి చినుకులకే వరద పారుతుందంటే భారీ వర్షాలకు ఇళ్లు నీట మునగడం పరిపాటిగా మారింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో నాగోలు డివిజన్ పరిధిలోని అయ్యప్పనగర్ కాలనీ, మల్లికార్జుననగర్ కాలనీల్లోకి పైకాలనీ నుంచి వరద నీరు వచ్చి ఇళ్లల్లోకి చేరడంతో ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు పరుగులు తీశారు. బండ్లగూడలోని శ్రావణిశ్రీ ఎన్‌క్లేవ్‌లోని గ్రీన్ టెర్రస్ అపార్ట్‌మెంట్ సెల్లర్‌లోకి భారీ వరద నీరు రావడంతో సెల్లర్‌లో ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగిపోయాయి. బండ్లగూడ శ్రీనివాస్‌నగర్ కాలనీలో భారీ వర్షంతో ఇంట్లోకి నీరు చేరడంతో డీఆర్ఎఫ్ అధికారులు అక్కడ చేరుకుని వరద నీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలన్నీ చెరువులను తలపించారు. ఎల్‌బీనగర్ పరిధిలో ఎక్కడ చూసిన నాలాలు పొంగి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండ్రోజులు భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరికాలు జారీ చేస్తున్నారు. -నాగోలు







రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.43, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.43, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.21, సొరకాయ రూ17, పొట్లకాయ రూ.23, బీట్‌రూట్ రూ.28, కీర రూ.26, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.70. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సమస్యల పరిష్కారానికి కృషి



సైదులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ ఉమెన్స్ కాలేజీలో బుధవారం నిర్వహించిన పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జనరల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ హాజరై నూతన కమిటీని ప్రకటించారు. జిల్లాల అధ్యక్షుడిగా సైదులు, ప్రధాన కార్యదర్శి సుమన్, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేష్‌రెడ్డి, సభ్యులుగా ఉదయ్, మోహన్ శ్రీకాంత్, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తానని చెప్పారు.

దీన్‌దయాళ్‌కు నివాళి



దీన్‌దయాల్ జయంతిలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బీజేపీకి బలమైన పునాదులు వేసిన దీక్షాదక్షుడని ఆ పార్టీ కర్ణాటక తమిళనాడు ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మలక్‌పేట మార్కెట్‌లో నిర్వహించిన దీన్‌దయాళ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్, నవీన్ పాల్గొన్నారు.

ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తాం



అవార్డు అందుకుంటున్న కొల్లు అశోక్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు బోధిస్తామని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ పర్ఫార్మెన్స్ అవార్డు గ్రహీత కొల్లు అశోక్‌రెడ్డి అన్నారు. ట్రెయిన్ ద ట్రైనర్ వర్క్ షాప్ 170 బ్యాచ్‌లో కొల్లు అశోక్‌రెడ్డి ఆన్‌లైన్‌లో 30, ఆఫ్‌లైన్‌లో రెండు రోజులు ఈ నెల 21, 22, కోర్సు పూర్తి చేసుకున్న సందర్భంగా సర్టిఫికెట్‌తో పాటు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును ఎఫ్–2 సినిమా నటుడు ప్రదీప్ చేతుల మీదుగా అశోక్‌రెడ్డి అందుకున్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



సరూర్‌నగర్ చెరువులో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

లింగోజిగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చీఫ్ ఎంటామాలజిస్ట్ రాంబాబు పేర్కొన్నారు. బుధవారం సరూర్‌నగర్ చెరువు కట్టతో పాటు పరిసరాల్లో చెత్తను తొలగించి స్థానికులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త పేరుకుపోవడంతో దోమల వ్యాప్తిచెంది అంటూ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గోల్డేజ్ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఓ నోడల్ అధికారి భరత్‌రాజ్, ఎస్ఎస్ఎస్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యులు

మన్సూరాబాద్: వర్షాకాలంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ గైనాకాలజీ వైద్యనిపుణులు మేనక, అర్చనా దినేష్ బిడ్ల, ప్రసన్నలత, వాసవి సూచించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. డెంగీ, చికెన్‌గున్యా లాంటి వైరల్ జ్వరాలు తీవ్రంగా ఉన్నాయని, వీటితో సాధారణ ప్రజలతో పాటు గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్లేట్‌లేట్స్ తగ్గటం, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో ఆయాసం రావడం, రక్తం గడ్డకట్ట కుండా హేమరేజ్ ఏర్పడి షాక్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అనారోగ్యగ సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

మార్కెట్‌లోకి ఎంజీ ఈవీ కారు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ పీపీఎస్ మోటర్స్ షోరూంలో బుధవారం జాతీయ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైన జైస్వాల్ ఇంటలిజెంట్ సీయూవీ ఎంజీ విండర్సన్ ఎలక్ట్రికల్ కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినియోగదారుల ఆసక్తికి అనుగుణంగా ఎంజీ మోటర్స్ కార్లను తయారు చేస్తున్నారని తెలిపారు. అధునత ఫూచర్స్‌తో ఈవీ వాహనం అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఎంజీ మోటర్స్ ఇండియా చీఫ్ కమర్షియల్ అధికారి సతీందర్ సింగ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 3 నుంచి ఈవీ కార్ల బుకింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీపీఎస్ మోటర్స్ ఎండీ రాజీవ్ సింఘ్వీ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు కూడలి వద్ద ఆక్రమణలపై అధికారులు కొరడా ఝుళిపించారు. పూలు, పండ్ల వారు తోపుడు బండ్లు, షెడ్లను రోడ్డుపై వరకు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండడం, అక్కడికి వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించారు. అ క్రమంలో కొందరు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని పలువురు వ్యాపారులు వాగ్వాదానికి దిగగా రెండు, మూడు రోజుల క్రితమే నోటీసులు ఇచ్చామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ఇన్‌స్పెక్టర్లు అశోక్ రెడ్డి, ఘట్టు మల్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

చాదర్‌ఘాట్: అర్హులంతా ఓటర్లు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ సర్వే 94 శాతం పూర్తయిందని ఈ 28న చివరిరోజు అని 29న డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందన్నారు. బీఎల్ఓ ఇంటి వద్దకు రాకపోయినా, బీఎల్ఓ వచ్చినప్పుడు ఇంటి వద్ద లేకపోయినా ఈ నెల 28న సాయంత్రం వరకు సర్కిల్–6 కార్యాయానికి వచ్చి ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలన్నారు.

మూసీ పరిసరాల్లో రెవెన్యూ అధికారుల పర్యటన

చైతన్యపురి: మూసీ నదిలోని నివాసాలను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూసీ రివర్ బెల్ట్‌లో అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వారందరికి డబుల్ బెడ్రూమ్ కేటాయిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఉప్పల్ రెవెన్యూ పరిధిలోని చైతన్యపురి, సత్యానగర్, న్యూమారుతీనగర్ ప్రాంతాల్లో బుధవారం డిప్యూటి తహసీల్దార్, సర్వేయర్, సిబ్బంది పర్యటించారు. అధికార బృందాలను గమనించిన ఇళ్ల యజమానులు ఆందోళనకు గురయ్యారు. మూసీ బెల్ట్‌లో నిర్మాణాలను తొలగించే క్రమంలో ఇళ్లు కోల్పోయిన వారికి డబల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించటం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న నరేష్

మన్సూరాబాద్: సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శిగా ఎల్‌బీనగర్‌కు చెందిన జటావత్ నరేష్‌నాయక్ నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చామకూర రాజు ఆదేశాల మేరకు రాష్ట్ర కన్వీనర్ కేవీగౌడ్ ఉత్తర్వులు జారీ చేసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్‌నాయక్ మాట్లాడుతూ.. రైతులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

గతుక్కు రోడ్లు!



చంపాపేటలో వర్షాలకు కొట్టుకపోయిన రోడ్డు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఛిద్రమైన రోడ్లపై రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని రోడ్లు ధ్వంసమైనా పట్టించుకునే నాథులే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం బాధాకరమంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.
-మలక్‌పేట/ఎల్‌బీనగర్



గడ్డిఅన్నారం బస్తీ ప్రభుత్వ పాఠశాల వద్ద..



నాగోలు ఆనంద్‌నగర్ చౌరస్తాలో..



శాలివాహననగర్ మ్యాక్సివిజన్ వద్ద..



గడ్డిఅన్నారం బస్తీదవాఖానా ఎదురుగా..